భా ర వి

చిలకమర్తి లక్ష్మీనరసింహము గారు

మొదటి ప్రకరణము

భారవి సంస్కృతమహాకవులలో నొకఁడు. బ్రాహ్మణుఁడు. కిరాతార్జునీయ మను మహాకావ్యమును సంస్కృతములో రచించెను. ఈ తని కవిత్వము మిక్కిలి యర్థగాంభీర్యము గలిగి రసవంతమయియుండును. "భారవే రర్థగౌరవ" మ్మను నట్టి యార్యోక్తి యీవిషయమును స్థిరపఱుచు చున్నది. ఈ మహాకవినిగూర్చి చిత్రమయిన యొక కథ కలదు. ఇది సత్యమయినదని మేము స్పష్టముగా చెప్పఁజాలము. సత్యమయినను గాకపోయినను చిర కాలమునుండి పండితముఖమునుండి పారంపర్య ముగ వచ్చుటచేతను, వినోదకరముగా నుండుట చేతను ఈకథ వ్రాయుచున్నాము. భారవిభట్టు యొక్క తండ్రి భవానీభట్టు. ఈతఁడుగూడ గొప్ప పండితుఁడు. అట్లగుటచేఁ దనకుమారునకు యుక్త వయస్సువచ్చినతోడనే వానిని విద్యాప్రవిష్టునిఁ జేసి యతని కిరువది సంవత్సరములు దాఁటకమున్నె గొప్పపండితునిఁ జేసెను. బాల్యవయస్సు. వయస్సు నకు మించిన పాండిత్యము. పాండిత్యమునకుఁ దగిన కవిత్వము. విద్యాకవిత్వములకుఁ దగిన వినయసం పత్తి భారవిభట్టునకుఁ బెట్టనియలంకారము లయి, వానికి విశేషకీర్తిని సంపాదించెను. "పుత్రాదిచ్ఛేత్ప రాజయ"మ్మను నార్యోక్తి భవానీభట్టునందు సార్థక మయ్యెను. భారవి పాండిత్యమునందు సత్కవిత్వము నందు శాస్త్రవాదములందు తన జనకుని మించెను. అందుచే భవానీభట్టు సర్వవిధముల తన్ను ధన్యుని గా భావించెను. భారవిభట్టుయొక్క ప్రజ్ఞావిశే షములను మెచ్చి విద్వాంసులెవరయిన భవానీభట్టు నొద్ద కుమారుని స్తోత్రము చేసినప్పుడు భవానీభట్టు "కుఱ్ఱవాఁడు. వానికేమి తెలియును? వాని కేమియు రాదు. మీకు వానియందు గల యభిమానముచేత న ట్లనుచున్నారు. స్తోత్రముచేయఁదగినంత గొప్ప తనము వానియందు లేదు" అని పలుకుచుండును.

కుమారునిస్తోత్రము తండ్రి వినఁగూడ దనియు నెవ రయిన పొగడినప్పు డీవిధముగానే పలుక వలయు ననియు మన పెద్దలు చెప్పుదురు. ఇతరుల తోపాటు తండ్రి కొడుకును మెచ్చుకొనినపక్షమున కుమారున కాయువు క్షీణ మగు నని మనవారి యభిప్రాయము. అదియును గాక "ఆత్మావై పుత్ర నామాసి" అను వేదవాక్యము కలదు. మను ష్యుఁడు తానే పుత్రరూపముగ జన్మించుచున్నాఁ డని వాని తాత్పర్యము. అందుచేత జనకుఁడు పుత్రుని మెచ్చుకొనుట తన్ను మెచ్చుకొనుటయే యగును. ఆ కారణముచేతఁ గూడ తండ్రి కుమా రుని స్తోత్రము వినఁగూడదని పండితులయభిప్రా యము. ఇవి యన్నియు మనస్సులోఁ బెట్టుకొని భవానీభట్టు కుమారునిపొగడ్తకు విముఖుఁ డయ్యె ను. ఇది భారవిభట్టునకు మిక్కిలి కష్టమై తోఁ చెను. దిగ్దంతులవంటి మహాపండితులు దేశదేశము నుండివచ్చి తన్ను స్తోత్రము చేయుచున్నప్పుడు తన తండ్రి వారితోఁ గలసి తన్నుఁ బొగడకపోవుటయే గాక మీఁదు మిక్కిలి తన్ను హీనునిఁగా తండ్రి

పరిగణించుటచేత భారవిభట్టునకు తండ్రిమీఁద మిక్కిలి కోపము వచ్చెను. తన పాండిత్యప్రకర్షము జూచి, యోర్వలేక తండ్రి ఇట్లు చేయుచున్నాఁడని యతఁడు భావించెను. కొడుకుపోగడ్త తండ్రి చేయఁగూడదను సంప్రదాయము భారవిభట్టు తెలియఁడు. అందుచే నతనికి తండ్రియభిప్రాయమెట్టిదయినఁ దెలియక యీవిధమయిన క్రోధమునకు వశుఁడయ్యెను. అటులుండ నొకనాఁడొక గొప్పసభ జరిగెను. ఆ సభలో సుప్రసిద్ధులయిన మహావిద్వాంసులు భారవిభట్టుచే నోడింపఁబడిరి. అప్పుడు సభాసదులెల్ల భళీభళీ యని భారవిభట్టును మెచ్చి పొగడిరి. కుమారునివిజయమునకు తండ్రి మహానందబాష్పములు విడిచి లోలోన సంతోషించియు "వాని కేమి తెలియును? వాని కేమి తెలియును? వానియొద్ద స్తోత్రము చేయఁదగిన గొప్పతనము లేదు." అని తన వాడుక ప్రకారము ప్రశంస మందీకృతము చేసెను. అప్పు డప్పు డొక పండితులయొద్దనే తండ్రి తన ప్రజ్ఞ నల్పముగఁ జేసి మాటలాడినందుకే మనస్సులో నెంతో కుందుచున్న భారవిభట్టున కాసమయమున జనకుఁడు చెప్పిన పలుకులు ముల్కులవలె నాటెను.

నాటుటయు, నాతఁడు చివాలున సభలోనుండి యింటికిఁ బోయి తల్లికడకుం జని యిట్లనియె. "అమ్మా! యెన్నిదినములనుండియో నీతో నే నొక మాట చెప్పందలంచి యెప్పటికప్పుడే పోనీ యెందుకని యూరకుండుచు వచ్చితిని. నాపాండిత్యమును జూచి నాయన యోర్వలేక నన్నందఱుముందు నిందించుచుండును. నా స్తోత్రము గిట్టదు. ఎవ రెప్పుడు నన్ను స్తోత్రముచేసినను 'వాఁ డేమెఱుఁగును? కుఱ్ఱవాఁడు. వాని కేమియు రాదు.' అని నన్ను హీనునిగాఁ బరిగణించుచుండును. దేశములో నున్న పండితుల కందఱకు నెంతో పూజ్యుఁడనయియున్న నేను వీనికంటికి గడ్డిపరకగా గనఁబడుచున్నాను గాబోలు! ఈతనిపాండిత్య మెంత? ఈతఁ డెంత? నాముందరనిలుచుండుటకయినఁ దగఁడు. ఈతనిం జంపివేయవలయునంతకోపము నాకు వచ్చుచున్నది. ఈతఁడు నాకు తండ్రి కాఁడు పరమశత్రువు. ఈతని మొగము జూడఁదలంచుకోలేదు. వీనిమొగముజూచిన మహాపాతకము వచ్చును. ఇతనియింట నుండఁదలఁచుకోలేదు. ఇంకొకసారి యీవిధముగా నన్ను గుఱించి ప్రశంసించినపక్షమున నెత్తురుకన్నుల జూచెదనని స్పష్టముగాఁ జెప్పుము. నేటిదినము మహావిద్వాంసులసభలోఁ గూడ నీవిధముగానే పరాభవించినాఁడు. దీనిని సహింపఁజాలనని చెప్పుము." ఆపలుకులు వినఁగానే తల్లి నిశ్చేష్టితురాలయి, కొంతవడి కిట్లనియె. "నాయనా తొందరపడకు. మీనాయనగారు వయస్సుచేతను విద్యచేతను మిక్కిలి పూజ్యులు. ఆయన యవివేకులు గారు. ఆయన యెందుచేత నిట్లనుచున్నారో, కారణము తెలిసికొని చెప్పెదను. అంతవఱకు తొందరపడకు నాయనా," యని చెప్పఁగానే, "సరే కనుఁగొని నాతోఁ జెప్పుము. కారణ మేముండును? ఓర్వలేనితనమె" యని సణుగుకొనుచు నతఁడావలికిఁబోయి గదిలోఁ గూర్చుండెను. తర్వాత భవానీభట్టు గృహమునకువచ్చెను. రాఁగానే, భార్య కొడుకు తనతో చెప్పినమాట లాయననడిగి, కుమారునియొక్క మనోవైకల్యము నంతయుఁ దెలిపెను. భవానీభట్టు విషాదసంతప్తమానసుఁడయి యిట్లనియె. "నా కుమారుఁడింత తెలివితక్కువవాఁ డగునని నే నెప్పుడు తలంపలేదు. తండ్రి కుమారుని దానుస్వయముగా స్తవ మొనరింపఁగూడదు. మఱియొకరు స్తవ మొనరించుచున్నప్పుడు విని యూరకుండఁగూడదు. తానుఁగూడ నితరులతోఁ గలసి కొడుకును మెచ్చుకొన్న, కొడు

కన కాయుఃక్షీణమగును. అందుకు భయపడి వాని కేమి తెలియునని పలుకుచువచ్చితిని. వాని కేమి తెలియ దని నా యభిప్రాయము కాదు. వాఁడు నాకంటె గొప్పపండితుఁడు. నాకంటెనే కాదు. వానితో సమానుఁ డయిన విద్వాంసుఁ డీనాఁటి పండితులలో లేనేలేడని చెప్పవచ్చును. నా కొడుకును బొగడుట నన్ను నేఁ బొగడుకొనుట యని మానితిని గాని వాని కీర్తి తగ్గించుటకు గాదు. ఇటువంటి కుమారరత్నము నాకుఁ గలిగి నందుకు మనస్సులో నే నెంత సంతసించుచున్నానో పరమేశ్వరుఁ డెఱుఁగును. వాడు నా కులదీప మని, నా వంశాలంకార మని, నా పుణ్యముపంట యని, నేను సంతోషించుచున్నాను. చిన్నతనముచేత వాని కీవిషయము తెలియక దురభిప్రాయపడినాఁడు. మనస్సులో నట్టి యభిప్రాయ ముంచుకోవద్దని యాతనితోఁ జెప్పుము." ఈమాటలు గదిలో నున్న భారవిభట్టు చెవిని బడెను. పడఁగానే యతడు తాను తండ్రివిషయమయి పడిన దురభిప్రాయమునకు మిక్కిలి పశ్చాత్తాప మొంది, మెడకు బట్టఁజుట్టుకొని కన్నీళ్లతోఁ దండ్రి కాళ్లపయిఁ బడి తా జేసిన నేరము క్షమింపుమని వేఁడుకొని చేయఁదలఁచిన పితృద్రోహ మహాపాతకమునకు దగిన ప్రాయశ్చిత్తము విధింపు మని ప్రార్థించెను. పాదముపయి బడ్డకొడుకును లేవనెత్తి తండ్రి "సంవత్సర మత్తవారియింట నుండి రమ్ము. దీని కిదే ప్రాయశ్చిత్త" మని విధించెను.

రెండవ ప్రకరణము - అత్తవారియింట నివాసము

తండ్రిని నిందించినందుకుఁ జంపదలచినందుకు మహాప్రాయశ్చిత్తముగా భారవిభట్టు కొంతకాల మత్తవారియింటఁ దనతండ్రి యానతిచ్చినచొప్పున వాసము చేయుటకు నిశ్చయించుకొని తల్లిదండ్రులను విడువవలసివచ్చినందుకు మిక్కిలి విచారించి పయనమయి బయలుదేఱిపోయెను. కొడుకును వి[illegible] లేక తలిదండ్రులు విచారించిరి. భారవిభట్టుయొక్క భార్య పుట్టినింటనే యుండెను. పునస్సంధాన మయినది కాని యామె నత్తవారింటికిఁ బంపలేదు. అల్లుండు వచ్చినతోడనే యత్తమామలు బావమఱఁదులు ప్రత్యుత్థానముచేసి సాదరముగా సగౌరవముగా లోపలికిఁ దీసికొనిపోయి, సకలోపచారములు చేసిరి. మూడునాలుగుదినము లయినతరువాత మామగారు వచ్చినపని యేమని యడిగిరి.

తనదుర్వినయమునకు ప్రాయశ్చిత్తముగాఁ నత్తవారింట నుండవలసి వచ్చినట్లు చెప్పక కొన్ని కారణములచేతఁ దనకుం దండ్రికి మనఃస్పర్థలు బయలుదేఱుటచేతఁ గొంతకాల మిక్కడ నుండవలసి వచ్చినట్లు చెప్పెను. అది విని మామగారు పెదవి విఱిచెను. ఆ దినము మొదలుకొని భారవిభట్టున కదివఱకు జరుగుచుండిన గౌరవాదులు క్రమక్రమముగా సన్నగింపఁజొచ్చెను. మొదటి మూఁడుదినములయందువలె నెగువపీటలు దిగువపీటలు వేసి యల్లునిఁ గూర్చుండఁబెట్టుట లేదు. అడుగకముందే యతనికిఁ గావలసిన వస్తువులు పూర్వము వాని యొద్దకు వచ్చుచుండెడివి. ఇప్పుడు పదిసార్లడిగినను వచ్చుచుండుట లేదు. పూర్వ మల్లునకు భోజనము పెందలకడఁ జేసి పెట్టుచు వచ్చిరి. ఇప్పు డందఱతోపాటు రెండుజాములు దాఁటినపిమ్మటనే మొదటి భోజనము జరుగుచు వచ్చినది. ఇతరసౌఖ్యములన్నియు నీవిధముగానే యడుగంటినవి. బావమఱఁదులు భారవిని దమపొలములోనికి రమ్మని పిలిచి కొని వెళ్లి మెల్లమెల్లగా నెక్కొక్కపనిఁ జేయించి తుట్టతుదకు పాటుగునపము తట్ట చేతికిచ్చిరి. భారవిభట్టు సకలపురాణములు సకలేతిహాసములు చదివిన మహావిద్వాంసుఁ డగుటచే "నవస్థాభేదములు చక్క

రాజ్యసుఖములు విడిచి రథసారథియైన నలచక్రవర్తికంటె, చండాలసేవ జేసిన హరిశ్చంద్రునికంటె, సన్న్యాసియైన ధర్మరాజుకంటె, వంటలవాడయిన భీమునికంటె, జడలు దాల్చి వనవాసము చేసిన రామునికంటె మన మెక్కువవారమా ? యనుభవింపవలసివచ్చినప్పుడు సుఖదుఃఖముల రెంటిని సమానముగ ననుభవింపకతప్ప" దని మనస్సు కుదురుపఱచుకొని యత్తవారే పనిఁ జెప్పిన నాపని శ్రద్ధాళుఁడై కూలివానికంటె నెక్కువ జాగరూకతతో జేయజొచ్చెను. కొన్నిదినము లెవరో యొకరు పొలములో నుండవలసివచ్చినందున బావమఱఁదులు భారవిభట్టునే యక్కడ నుండు మని యాజ్ఞాపించిరి. అతఁడు వారియాజ్ఞ శిరసా వహించి యక్కడనే యుండెను. అత్తవారు వానికి భోజనము భార్యచేత ప్రతిదినము పొలమునకుఁ బంపుచువచ్చిరి. భారవి నెంత అవమానపఱచినను నెంద ఱలుసు చేసినను భార్యమాత్ర మాతనియందుఁ బరమభక్తిగలిగి తన పుట్టినింటివారు తనభర్తయెడల చేయుచున్న యపచారములకు మిక్కిలి కుందుచు దాను జేయునదేమియు లేక తనశక్తివంచన లేక యాతనికి సకలోపచారములు చేయుచు, నెప్పుడు తన పుట్టినింటనుండి తా మిద్దఱును బయలుదేఱివెళ్లి సుఖపడు కాలము వచ్చునా యని మంచిదినములకై యెదురుచూచుచు ప్రతిదినము భర్తకాహారము పొలములోనికి తీసికొని వెళ్లి కడుపారఁ గుడువఁబెట్టి యాతనిమనస్సున కుల్లాసము గల్గించి వచ్చుచుండును. ఆ యూరిలోనివా రందఱు, భారవిభట్టుయొక్క యవస్థఁ జూచి "యాహాహా! ఈశ్వరసంకల్పముయొక్క వైచిత్ర్యములు!! మెచ్చఁదగినవి. గంటము పట్ట నలవాటుపడినవానికి గడ్డపాఱ చేతికి వచ్చినది. మహారాజసభలలో నుండువానికిఁ బొలములలో నుండవలసివచ్చినది. తర్కమీమాంసావ్యాకరణాది శాస్త్రములను వాదము సేయు నోటితో దుక్కిటెడ్లను చోయిచోయి యని నడిపించి పాలేళ్లను బిలువవలసి వచ్చినది. భుజములమీఁద శాలువ ధరించువానికి నాగళ్లు ధరింపవలసివచ్చినది." అని తమలోఁ దాము చెప్పుకొని జాలిపడు చుండిరి. ఈ యూహలలో నొకటియయిన బావమఱఁదులకుఁ గాని మామగారికిఁగాని తోఁపలేదు. పొలములో నల్లుఁ డెంత కష్టపడినను, సరిగాఁ బని చేయలేదని, యాతనిమీఁద వారందఱు విసుగుకొందురు. "తిండికేనుఁగు పనికి పీనుఁగు" నని పరిహాసమునకై కొన్ని మాటలు, నిజముగ కొన్నిమాటలు దెప్పుచువచ్చిరి. పిల్లిమీఁదఁ బెట్టి యెలుకమీఁదఁబెట్టి సాధించుచు వచ్చిరి. శూలములవంటి సూటిపోటుమాటలచేత నతనిమనసు నొప్పింపఁజొచ్చిరి. ఎక్కడ లేని సామ్యములు పోలికలు వానినిమిత్తమయి తీసికొనుచువచ్చిరి. చదువుకొనియు భారవి యప్పుడేమియు సంపాదింపకపోవుటచేత చదువుకొన్నవానికంటె చాకలివాఁడు మేలనియు చదువునే నమ్ముకొని పిల్ల నిచ్చుటకంటె పిల్లను గంగలోఁ డింపుట మంచి దనియు నేవో లేనిపోని సందర్భములు తీసికొనివచ్చి యత్తగారు పలుమాఱనఁ జొచ్చెను. చదువుకొన్నవానికి శాంతమె పరమ భూషణ మని భారవి నమ్మియుండుటచేత నీపలుకులెల్ల వినియు విననట్లయుండి, శరీరము దాఁచుకొనక వారిని మెప్పించుటకయి బహువిధముల పాటుపడుచు వారితో నెన్నఁడు వివాదపడక తండ్రి యేర్పఱచిన నియమితకాలము ముగియువఱకు వాఁడు పనిచేయఁ జొచ్చెను. సుఖపడుచున్నప్పుడు కాలము ఱెక్కలు కట్టుకొని మిక్కిలి వేగముగఁ బరుగెత్తును. మనుష్యుఁడు కష్టపడుచున్నప్పుడు కాలము సంకెలల కాళ్లతో నడుచువానివలె మందగమనము గలిగి

యుండును. భార్యకు నాతనికి గూడ దినములు సంవత్సరములయినట్లు తోఁచెను. ఇటులుండఁగా శ్రావణమాసము వచ్చెను. భారవిభట్టుమీఁద మామయు బావమఱఁదులు చేయు హుంకారధ్వనులవలెనే యుఱుము లాకాశమున వినంబడెను. భారవియొక్కయు భార్యయొక్కయు మనంబుల గ్రమ్మిన విచారపటలమువలెనే మేఘపటల మాకాశమున నిండెను. భారవి భార్యయొక్క కన్నుదమ్ములనుండి యప్పుడప్పుడు వెడలెడు బాష్పబిందువులవలెనె చినుకులు రాలఁజొచ్చెను.

ఒక్కొక్కప్పు డామెకు వచ్చు పెద్దదుఃఖమువలెనే గొప్పవానయు గురియఁజొచ్చెను. దుఃఖమధ్యమున నడుమనడుమఁ గనిపించు స్వల్పమయినయాశవలెనే మేఘములలో నుండి యప్పు డప్పుడు తళుకుతళుక్కని మెఱపులు మెఱయఁజొచ్చెను. అదృష్టవంతురాం డ్రయిన పుణ్యస్త్రీలకు శ్రావణమాసము మిక్కిలి మనోహర మయినది. ముత్తయిదువలు నోఁచుకొనునట్టి నోములు పెక్కు లీ మాసముననే యున్నవి. మంగళవారవ్రతము చేయని గృహమే యుండదు. శుక్రవారవ్రతములు భాగ్యవంతుల గృహములలో జరుగుచుండును. లక్ష్మీదేవి కూడ భాగ్యవంతుల గృహములలో నుండును గాని పేదల గృహములకు రాదుకదా. కొందఱు పేదలు సయితము నాలుగయిదురూకలు కూడఁబెట్టుకొని యే పిల్లకాసో తెచ్చుకొని నోము చేసికొందురు. భారవియొక్క బావమఱఁదుల భార్యలు కాసులఁ దెప్పించుకొని శుక్రవారవ్రతములఁ జేయఁదలంచిరి. తమ భార్యలకు కాసులు తెచ్చి యిచ్చి నోములు నోమించిన పక్షమున తమచెల్లెలు చిన్నబోవు నేమో యనుమాట వారికిఁ దోఁచినది కాదు. భారవిభార్య మిక్కిలిచిన్నఁబోయి యుండెను. రేపు వ్రతమనఁగా నామెభర్త కన్నము దీసికొని పోయి యాఁతడు భుజించినపిదప మిక్కిలి చిన్నఁబోయి యక్కడఁ గూర్చుండెను. చిన్నఁబోయి యుండుటకు కారణ మేమని భర్త యడిగెను. ఓదార్చువారుఁ గారణము లడుగువారు నున్నప్పుడు దుఃఖములు పొంగి పొరలి వచ్చుచుండును. భర్త యడుగఁగానే భార్యకు దుఃఖము పాలపొంగువలెనే పొరలి పొరలి వచ్చెను. కాటుకకన్నులనుండి నీరు జలజల ప్రవహించెను. భారవి కారణ మేమని యెక్కువ యాత్రముతో మరల మరల నడిగెను. కొంత సేదదేఱి యామె యిట్లని చెప్పెను: "మా వదినెలు బంగారునాణెములు తెప్పించుకొని శ్రావణ శుక్రవారము నోములు నోఁచుకొనుచున్నారు. నాకు నాణెములు లేవు సరికదా యూరక వ్రతమయిన నోఁచికొమ్మని యయిన మావాండ్రన లేదు. నాణెములు లేనందుకు వచ్చిన దుఃఖముకంటె మావాండ్రు నాకుఁ జేసిన యనాదరణమున కెక్కువదుఃఖము వచ్చుచున్నది. మా పుట్టినయింటనుండి మన మెప్పుడు వెళ్లుదుమో నాకు దెలియకున్నది." ఆ మాటలు విన్నతోడనే భారవి యిట్లనియె: "ఓసీ వెఱ్ఱిదానా! మాతండ్రి యొకసంవత్సరము గడువు పెట్టెను. గడువు దాదాపుగా ముగియవచ్చినది. ఇంక రెండు మాసము లున్నవి. ఈ గడువు దాఁటినపిదప నేను నీకు గావలసినన్ని రూక లిచ్చెదను. అయినను విచారపడకుము. నా కొక్కయుపాయము దోఁచుచున్నది. నేను కిరాతార్జునీయ మను మహాకావ్యము రచియించుచున్నాను. అందులో నొకశ్లోకమున్నది.

శ్లో. సహసా విదధీత న క్రియా
మవివేకః పర మాపదాం పదమ్
వృణుతేహి విమృశ్యకారిణం
గుణలుబ్ధాః స్వయమేవ సంపదః.

అర్థము: సాహసించి యేపని చేయఁగూడదు. అవివేకము మిగుల ఆపదలకుఁ గారణము. సంపదలు గుణములయం దాసక్తి గలిగినవి. అందుచేత నవి చక్కఁగా నాలోచించి కార్యములు చేయువానినే యాశ్రయింపుఁడు.—ఈ యూరిలో నొకకోమటి యున్నాఁడు. అతఁడు విద్వాంసుఁడు. ఈశ్లోక మాతనియొద్ద తాకట్టుఁ బెట్టి కొన్నిరూకలు తెచ్చుకొని యందులో నొక కొంతఁ బెట్టి నాణెము కొని తక్కినసొమ్ము బెట్టి నీకుఁ గావలసిన వస్తువులు తెచ్చుకొని మిక్కిలి శోభాకరముగా వ్రతముఁ జేసికొనుము. ఇది వెండియా? బంగారమా? దీని మీఁద నెవ్వఁడు సొమ్మిచ్చునని తలంపకుము. ఆ కోమటి తక్కినవర్తకులవంటివాఁడు గాఁడు. చదువుకొన్నవాఁడు. నాసామర్థ్య మెఱిఁగినవాఁడు. అతఁడు తప్పక దీనిమీఁద నీకోరినసొమ్మిచ్చును. ఈశ్లోకము తాకట్టు వదలించుకొనకుండ నేను పుస్తకమును ప్రకటింపనని యాతనితోఁ జెప్పుము. నామాట నతఁడు శిరసావహించును." అని తాటాకు, గంటము పుచ్చుకొని యాశ్లోకమును వ్రాసి యిచ్చి భార్యను బంపెను. శ్లోకమును తాకట్టుపెట్టుట యామె కని విని యెఱుఁగదు. వర్తకుఁడు శ్లోకమును కుదువఁ బెట్టించుకొని సొమ్మిచ్చునను నమ్మక మామెకు లేదు. లేకపోయినను మగనిమాట చెల్లింపవలయునని యామె దానిం దీసికొని వర్తకునియొద్దకు బోయి వానిచేతి కిచ్చి సొమ్మడిగెను. వర్తకుఁడు దానిని జదువుకొని యామె నేవో కొన్ని ప్రశ్నలడిగి యామె సమాధానము చెప్పినతరువాత కొన్నిరూక లామె కిచ్చి కవిలె కట్టలో పద్దు వ్రాసికొని శ్లోకము వ్రాసిన తాటాకును వ్రాసిన గంటమును నొక వెదురుగొట్టములో బెట్టి యాగొట్టమునకు మూఁత వేసి దానిని చూరులో దోఁపెను. రూపాయలు తీసికొని యామె పరమానందభరితురాలయి బంగారునాణెము, వలయు పదార్థములు తెప్పించుకొని వదినెలకంటె నెక్కువ వైభవముతో వ్రతము చేసికొనెను. శ్లోకముతాకట్టుమీఁద సొమ్ము తెచ్చుకొనుట విని యామె యన్నదమ్ములు తల్లిదండ్రులు మిక్కిలి యాశ్చర్యము నొందిరి. ఊరివారందఱు విని విస్మయము నొందిరి. కొందఱు కోమటి వెఱ్ఱివాఁడనిరి. భారవి రాతియొద్దఁగూడ డబ్బుపుట్టింపఁగలఁడని కొంద ఱనుకొనిరి. బ్రాహ్మణులకు వ్రతమునిమిత్తము సొమ్మిచ్చుట పుణ్యమని వర్తకుఁడు భావించి సొమ్మిచ్చెనే గాని శ్లోకముతాకట్టుమీఁద సొమ్మిచ్చియుండఁడని, కొందఱు పలికిరి. "ఇప్పుడియ్యఁగానె సరికాదు వడ్డికి వడ్డి గట్టి కవీశ్వరుఁడుగారి కొంప గోలె మమ్మించి పుచ్చుకొను" నని కొందఱనిరి. ఏ మన్న నేమి కార్యము నెఱవేఱినదికదా!!

మూఁడవ ప్రకరణము - ప్రతిజ్ఞాపూర్తి

శ్లోకము తాకట్టు పెట్టిన కొన్నిదినములలోనే వర్తకుఁడు వ్యాపారముమీఁద ద్వీపాంతరమునకుఁ బయనమయి వెళ్లెను. దైవవశముచేత నప్పు డెదురుగాలి వీచుటచే నతఁ డెక్కినయోడ సరిగా నడువదయ్యెను. తరువాత కొన్నాళ్లకాయోడ పగిలిపోయెను. ఒకద్వీపమును చేరుటకు బదులుగా నతఁడు మఱియొకద్వీపమును జేరెను. ఆ ద్వీపమునం దతని నెఱిఁగినవారుగాని యాతనిభాష మాటలాడువారుగాని లేనందున నతఁ డచ్చట నెన్నిచిక్కులు పడవలయునో యన్నిచిక్కుల బడెను. వెంటఁ దీసికొనిపోయిన ధనమంతయు నోడ పగిలినప్పుడు సముద్రముపాలయ్యెను. లక్షలకొలఁదిరూకలతో వ్యవహరించునాతని కొక్కరూక కఱవయ్యెను. ఎన్నఁడలవాటు లేకపోయినను స్వకాయకష్టమువల్ల నతఁడు జీవింపవలసివచ్చెను. లక్షాధిపతులను భిక్షా

ధిపతులుగను భిక్షాధిపతులను లక్షాధిపతులుగను జేయునట్టి యనిర్వచనీయ ప్రభావుఁ డగుటఁ బరమేశ్వరునియాజ్ఞాబలమునకు గించిజ్ఞుఁడైన మనుష్యునిబుద్ధిబల మెదురై ప్రతిఘటింప నేర్చునా?

ఇట్ల భారవి తండ్రియాజ్ఞ ప్రకారము మామగారియింట నుండవలసిన కాల ముండి గడువుచెల్లిన తోడనే యా యత్తమామలవద్ద సెలవు పుచ్చుకొని బావమఱఁదులను వీడ్కొని భార్యాసమేతుఁడై స్వగ్రామమునకుఁ బోయెను. తన్నారీతి నవమానముచేసిన బావమఱఁదుల యందుఁగాని అత్తమామలయందుఁగాని యాతనికి ద్వేషము జనింపలేదు. అక్కడకు వచ్చినప్పు డతనిమన స్సెంత యుల్లాసముగా నుండెనో వెళ్లునప్పుడు నంతయుల్లాసముగా నుండెను. వెళ్లునప్పుడు మునుపటికంటె నెక్కువయుల్లాసముగా నుండె నని కూడ చెప్పవచ్చును. అట్లుండుట కొక కారణము గలదు. మామగారియింటనున్న కాలములో నతఁ డెక్కువ లోకానుభవము సంపాదించెను. ఏమనుష్యుఁడుగాని తాను స్వయముగా కష్టపడి ధనసంపాదనము సేయక యొకరికి భారముగా నున్నపక్షమున నాతని గౌరవ మొక క్షణములో బోవుననియు నాత్మగౌరవము నిలుపఁదలఁచుకొన్న ప్రతిమనుష్యుఁడు ప్రాలుమాలక లేక మేనువంచి పనిచేసి స్వకుటుంబపోషణము చేసికొనవలసిన దనియు నతఁ డనుభవము వలన నేర్చుకొనెను. ఈ యనుభవసిద్ధమయిన జ్ఞానము తండ్రివద్ద కష్టపడి దెబ్బలు తిని చీవాట్లు తిని నేర్చుకొన్న తర్కశాస్త్రముకంటె వ్యాకరణశాస్త్రముకంటె మీమాంసాశాస్త్రముకంటెఁ గవిత్వముకంటె నాతని కెక్కువలాభకారి యయి యుండెను. లోకానుభవముకూడ విద్యయే. విద్య యనఁగా కేవలము పుస్తకము విప్పి పాఠము చదువుట కాదు. లోకానుభవము పుస్తకములు నను నీ రెండింటివల్లను మనుష్యుఁడు జ్ఞానసంపాదనము సేయును. లోకానుభవమే లేకపోయినయెడల జ్ఞానముసంపూర్ణము కాదు. ఈ యనుభవ మాతనికి బహుద్రవ్యముకంటె నెక్కువ యుపయుక్త మై యుండెను. శాస్త్రజ్ఞానము నేర్చుకొనుచున్నప్పుడు గురువుగారు చెంపకాయలు కొట్టినను మనుష్యుఁ డెట్లు సహించి యూరకుండునో లోకానుభవజ్ఞానము నేర్చుకొనునప్పుడు నదియుఁగూడ విద్యయే యని బాధలు సహింపవలెను. భారవి స్వగ్రామమునకు వెళ్లినతరువాత కిరాతార్జునీయకావ్యమును సమాప్తము చేసి సవరించియు దానిం బ్రకటింపలేదు. ఏల యనఁగా నందులో నొకశ్లోకము లేక పుస్తకము సమాప్తము కాదు. అసమాప్త గ్రంథము ప్రకటించుట యతని కిష్టము లేదు. ఆ శ్లోకము నీతఁడు ప్రకటించినను, వర్తకుఁడు తగవులాడఁడు. పైగా వర్తకుడు దేశములో లేఁడు. అయినను భారవి నీతిసంపన్నుఁ డగుటచే వణిజుని సొమ్ము వణిజున కిచ్చి శ్లోకమును విడుదల చేసికొనకముందు దానిని తాను గ్రహించి ప్రకటించుట దుర్నీతి యని నమ్మి యూరకుండెను. అట్లు పదునెనిమిది సంవత్సరములు గతించెనట. ప్రకటించుట యనఁగా నా దినములలో నచ్చువేయుట కాదు. ఇతరులు వ్రాసికొనుటకై తన తాటియాకు పుస్తకము నిచ్చు నదియే. ఆ మహాకావ్యము ప్రకటింపఁబడక పోయి నందులకు విద్యార్థులు పండితులు మిక్కిలి విచారించిరి. వర్తకునియొద్దనుండి వర్తమాన మేనాఁటికిం దెలియలేదు. అతఁడు మృతినొంది యుండు నని బంధువులు నిశ్చయించిరి. ఉత్తరక్రియలు జరిగించుట సముచితమా యని బంధువులు ధర్మశాస్త్రజ్ఞుల నడుగఁ జొచ్చిరి. ధర్మశాస్త్రజ్ఞులు తమ

ప్రాంత తాటియాకులు ధర్మశాస్త్రములు తిరుగవేయఁ జొచ్చిరి. అప్పుడయినను భారవి తన గ్రంథము ప్రకటింపఁదలఁచుకొనలేదు. వర్తకుని నిశ్చితవార్త తెలియవలెను, గ్రంథము ప్రకటింపవలెనని యూరకుండెను.

భారవి - పలవప్రకిరణము - తాకట్టువిడుదల

పదునెనిమిది సంవత్సరములు గతించి పందొ[illegible] సంవత్సరము నడచుచుండఁ జిరప్రవాస[illegible]యిన వర్తకుఁడు స్వస్థలముం జేరెను. స్వగ్రామమునకు సమీపమందున్న రేవుపట్టణములో నతఁడు నావ దిగి స్వగృహము జేరునప్పటికి రాత్రి జాము ప్రొద్దు పోయెను. చిరకాలము క్రిందట చూచుటచేతను రాత్రి యగుటచేతను వాని నెవ్వ రానవాలు పట్టలేదు. ఇంటికి వచ్చి యతఁడు తలుపు తట్టినతోడనే గృహసేవకులు తలుపుతీసిరి. ఎవరు మీరని సేవకు లడుగఁగా నే నింటియజమానుఁడగు వర్తకుఁడనని యతఁడు ప్రత్యుత్తర మిచ్చెను. ఆమాటలు విని సేవకులు తెల్లబోయిరి. అందొకఁడు పోయి యజమానురా[illegible] నీవార్త విన్నవించెను. ఆ మాటలు వినఁగానె యామె సంతోషాశ్చర్యంబులు మనంబున మల్లడిగొన పదునెనిమిది సంవత్సరములు వయస్సుగల యొకపడుచువానిని వెంటఁబెట్టుకొని భర్త దర్శనమునకు వచ్చెను. ఆ పడుచువాఁడు వర్తకుని జూచి 'నాయనగారు నమస్కార'మని పాదములపయిఁ బడెను. 'వీఁ డెవ్వఁడని' వర్తకుడు భార్య నడిగెను. 'వీఁడు మీకుమారుఁ'డని భార్య ప్రత్యుత్తర మిచ్చెను. ఆ మాటలు వినఁగానే వర్తకుఁడు కోపము నాశ్చర్యము సందడించు హృదయముతో నిట్లనియె: "ఓసీ దుర్మార్గురాలా! నేనీ స్థలము విడిచివెళ్లునప్పటికి నాకు లేనికొడుకు నేను వెళ్లిన తరువాత బయలు దేఱినాఁడా? దేవతావరప్రసాదముచేతనో నీ పతివ్రతాధర్మముచేతనో భర్త దేశాంతరమందుండగనే నీకు కుమారుఁడు జన్మించినట్లు తోఁచుచున్నది. వీఁడు నీకొడు కయినమాట నిజమే కాని నాకొడుకయి యుండఁడు. వీఁ డెవనికొడుకో వానికే వెళ్లి నమస్కారము చేయవలసినదిగాని నాకు చేయఁగూడదు. నీ వింత దుర్మార్గురాలవని నే నెన్నఁడు దలపోయలేదు. నేను దేశాంతరమందు మృతినొందితి ననుకొని నీ కొడుకు నీవు సుఖముగ జీవింపవచ్చు ననుకొంటివి గాబోలు. మీ దౌర్జన్యము బయలుపెట్టుటకే భగవంతుఁడు నన్ను బ్రతికించినాఁడు. ఛీ! మీరు నా యెదుటనుండి లేచి యవ్వలకుఁ బొండు. మీ మొగములు చూచుట మహాపాతకము" అని తూలనాడుచుండ భార్యయుఁ గుమారుఁడు నిశ్చేష్టు లయి ప్రత్యుత్తరము నీయఁజాలరయిరి. ఆతని కేకలు విని యిరుగుపొరుగువా రనేకులు వచ్చి వర్తకునితో "నీవు వెళ్లునప్పటికి నీభార్యకు నెల తప్పినది. అది నీ వెఱుఁగవు. నీవు వెళ్లినతరువాత నీ కుమారునిఁ బ్రసవించినది. ఆమె పరమపతివ్రత. ఆమెయందు దోషము లే"దని చెప్పిరి. కాని యాతనికి తృప్తి జనింపదయ్యెను. అందఱు ఎవరిగృహములకు వారు పోయిరి. వర్తకుఁడు కంటికి నిదుర రామిచే గోడకుఁ జేరఁబడి కూర్చుండెను. తనకు భర్త గావించిన పరాభవమునకు దుఃఖితయై భార్య కంటికి నేలకు నేకధారగా నేడ్చుచుండెను. కుమారుఁడును గాటమయిన యవమానముచేత తలవంచుకొని విచారింపసాగెను. తనయెడ ద్రోహము చేసిన భార్యను, నామెకుమారుని నాఁటిరాత్రి యెట్లయిన సంహరింపవలయునని వర్తకుడు తలపోయఁజొచ్చెను. అట్లు తలపోయుచు నాయుధ మేదయిన సంపాదింపవలయు నని యిట్టటు తిరుగసాగెను. అట్లు తిరుగుచుండఁగా ముంజూరులో నతని కొక వెదురుగొట్టము కనఁబడెను. ఆ గొట్టము

లాగి తెఱచిచూడ నందులో నొకగంటము తాటాకు గనఁబడెను. గంటముతో వారిం బొడిచి చంపవచ్చునని సంతోషించి యాతాటాకులో నే మున్నదో చూడవలయు నని కుతూహలము పొడమ దానిం దీపపువెలుఁగునకు దీసికొనిపోయి చదువఁగొనెను. అది తనయొద్ద భారవి తాకట్టుఁ బెట్టినశ్లోక మయ్యెను. శ్లోకము చదువఁగానే దానియర్థ మతని మనంబున నాటెను.

అర్థము బోధపడినతోడనే గంటము క్రిందపాఱ వైచి పైకిచూచుచు నతఁ డాలోచనము చేయసాగెను. "ఏమిది! సాహసించి, ఏకార్యమును చేయఁగూడదు. అవివేకము మహాపదల కాస్పద మని కదా యీ శ్లోకార్థము. మహాకవి యైన భారవి యీశ్లోకము నాకు తాకట్టు పెట్టెనుగదా! దీనియం దెంతో విలువ యుండుటంబట్టియే గదా నాలుగు బంతుల శ్లోకమునకు నాలుగు వరహాలు నే నిచ్చితిని. నే నిప్పుడు చేయఁబూనిన పని మహాసాహసము. ఇది యవివేకము. చక్కఁగా విచారించి వీ రిద్దఱు దోషు లని తెలిసినపిదప నే నీకార్యము చేసెదను. ప్రస్తుతము విరమించెదను." అని యీ యుద్యమ ముపసంహరించి మఱునాఁడు గ్రామమం దున్న పెద్దలం గలసికొని తన గృహవృత్తాంత మంతయు వారి నడిగి తెలిసికొనెను. వా రందఱు నైకకంఠ్యముగ ని ట్లనిరి: "నీభార్య మహాపతివ్రత. ఈతఁడు నీ కుమారుఁడు. నిష్కళంక మయిన మనసుతో నీవు వానితోఁ గాఁపురము సేయవచ్చును." ఆ మాటలు విని తృప్తినొంది వర్తకుఁడు దారపుత్త్రులం జేరఁదీసి మరల సంసారి యయ్యెను.

వర్తకుఁడు వచ్చినవార్త విని భారవి శ్లోకము తాకట్టు వదలించుకొని గ్రంథము ప్రకటించుకొను సమయము వచ్చినదని పరమానందభరితుఁ డయి యాతనియొద్ద పుచ్చుకొన్న నాలుగువరహాలు వడ్డితోఁ గూడ దీసికొని వచ్చి యతని కిచ్చి తాకట్టు శ్లోకము నిమ్మని యడిగెను. తాను వచ్చువఱకు శ్లోకము వదలించుకొనువఱకు గ్రంథము ప్రకటింపక [illegible]లువఁ బడియున్న యమ్మహానుభావుని భారవిని గని వర్తకుఁడు లేచి దృఢప్రణామంబు గావించి యాతని కిట్లనెను: 'మహాత్మా! యీ శ్లోకము నిమిత్తమయి గ్రంథ మంతయు ప్రకటింపక యాఁగిన నీ వంటి మహానుభావులు తఱుచుగా లోకమున సంభవింపరు. నీయొద్ద నేను సొమ్ము గ్రహింపఁజాలను. ఏల యనిన శ్లోకమువలన నేను మహోపకారము నొందితిని. ఆశ్లోకమువలన నాకు భార్యయుబిడ్డయు బ్రతికిరి. దానివలననే నాకీర్తి నిలిచెను. మీశ్లోకము అక్షరలక్షలు విలువగలది. అందుచేత నేను మీయొద్ద సొమ్ము పుచ్చుకొనను సరేగదా విశేషించి మీకు గొప్పబహుమానము గూడ చేయఁదలంచుకొన్నాఁడను" అని వేయిమాటపదాఱు లాయన కిచ్చి సమస్కరించి పంపెను.